# ప్రారంభానికి సమీకృత కార్యాలయం సిద్ధం

- రూ.17 కోట్లతో భవన సముదాయం
- నేడు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభం
- దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్న మంత్రి



దుబ్బాకలో సిద్ధమైన సమీకృత కార్యాలయం

దుబ్బాక టౌన్, అక్టోబర్ 1 : ప్రభుత్వ కార్యాలయాలు ఒకచోట నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలిగించి మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నది. జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ తరహాలో మండల కేంద్రాల్లోనూ సమీకృత భవనాలను ప్రభుత్వం నిర్మించి ప్రజలకు మేలు చేస్తున్నది. అందులో భాగంగా దుబ్బాకలో రూ.17 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో రామసముద్రం చెరువు కట్ట కింద వంద పడకల దవాఖాన సమీపంలో సమీకృత భవన నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. నేడు (సోమవారం) ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమీకృత కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ భవనంలో తహసీల్ కార్యాలయంతోపాటు హార్టికల్చర్, ఫారెస్ట్, పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను సమీకృత కార్యాలయం నుంచే నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు. దుబ్బాక సమీపంలో ఏర్పాటు చేసిన సమీకృత భవనంతోపాటు మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవాల ఏర్పాట్లను ఆదివారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు.

**దివంగత ఎమ్మెల్యే సోలిపేట విగ్రహావిష్కరణ..**

దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కాంస్య విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. స్థానిక డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద రామలింగారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాత, కుమారుడు సతీశ్‌రెడ్డి కోరారు.

**బీఆర్ఎస్‌తోనే దుబ్బాక అభివృద్ధి..**



సీఎం కేసీఆర్‌కు దుబ్బాక ప్రాంతంపై అమితమైన ప్రేమ ఉన్నది. ఆయన చలవతోనే దుబ్బాక శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వానికి కంటు కోటలు. దుబ్బాక నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దుబ్బాక అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ


మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయించాలని వినతి

చేర్యాల, అక్టోబర్ 1 : పాత నియోజకవర్గ కేంద్రమైన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయించాలని కోరుతూ ఆదివారం మంత్రి హరీశ్‌రావును చేర్యాల మాజీ ఎమ్మెల్యే కాటం లింగయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకా, సమితి, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాల ప్రస్తుతం మండల స్థాయికి పడిపోయిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పేదలను ఆదుకోవడమే లక్ష్యం


మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న మామిడి మోహన్‌రెడ్డి తదితరులు

రాయపోల్, అక్టోబర్ 1 : పేదలను ఆదుకోవడమే ప్రజాహిత ఫౌండేషన్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్కల్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పిట్ల శ్రీను, శతగల నగేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మోహన్‌రెడ్డి ఆదివారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ శ్యామలాకుమార్, ఎంపీటీసీ వెంకటయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ మురళి, మండల నాయకులు మల్లేశం, స్వామి, పాదూల్, పరశురాములు, మల్లేశం, యాదగిరి, ప్రవీణ్, రవి తదితరులు ఉన్నారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 1 : అక్టోబర్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే ఎస్సీ ఉపకులాల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లెమ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా కోశాధికారి బైరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్వేల్‌లో బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రిక, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలకు అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాలు కేటాయించి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా పార్టీలను కోరారు. హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్, కొమురంభీం మనుమడు సోనేరావుభీం ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ మోచి సంఘం అధ్యక్షుడు బైరి రవి, నాయకులు వేణుగోపాల్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

## నేడు జర్నలిస్టుల నిరసన

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 1 : ఇండియన్ జర్నలిస్టు యూనియన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖల పిలుపు మేరకు నేడు నిర్వహించే జర్నలిస్టుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు దాస జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ మీడియా రక్షణ చట్టం, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయడంతోపాటు అక్రిడిటెడ్ జర్నలిస్టులకు కేంద్రం రైల్వే పాసులు అందించాలన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేడు (సోమవారం) నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలంటూ గజ్వేల్‌లోని కోర్టు వద్ద గల గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జర్నలిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సత్తాచాటిన ఎంజేపీ విద్యార్థులు

రాయపోల్, అక్టోబర్ 1 : స్కూల్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అండర్–17 బాలుర విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో దౌల్తాబాద్ మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానంతో నిలిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పీడీ వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడంతో విద్యార్థులను అభినందించారు.

# వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి**


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 1: తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నదని, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగానే నేడు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల రూపురేఖలు మారాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయి జీడీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సహకారంతో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు చేయించడం శుభపరిణామమన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ అవసరమన్నారు. ప్రతిరోజూ నడకకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు ఆహార నియమాలు పాటించాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా పని చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన దవాఖానలతో గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుపేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, ట్రస్మా సంఘం జిల్లా నాయకుడు ఇన్నారెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్ : వయోవృద్ధులను సన్మానించిన ఆర్డీవో

## వయోవృద్ధులకు సన్మానం

గజ్వేల్, అక్టోబర్ 1 : ప్రపంచ వయోవృద్ధుల ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదివారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బన్సీలాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వయోవృద్ధులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో సులభతరంగా ఉండేలా వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రాజు, డీటీ భవానీ, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో..**

హుస్నాబాద్, అక్టోబర్ 1 : హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఆర్డీవో బెన్ షాలోమ్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి, ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్లపై సీనియర్ ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీలు అశోక్, సతీశ్, రెవెన్యూ సిబ్బంది, 155 మంది సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు.

## ముస్లింల శాంతి ర్యాలీ

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 1 : గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఆదివారం ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. గత నెల 28న మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని శాంతి ర్యాలీ నిర్వహించాల్సి ఉంది. పీస్ కమిటీ, మత పెద్దల ఆదేశాల మేరకు వినాయక నిమజ్జనోత్సవాల అనంతరం ఈ పండుగను జరుపుకోవాలని తంజీముల్ మజీద్ కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా గజ్వేల్ తంజీముల్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో పాత మజీద్ నుంచి గజ్వేల్‌లోని ప్రధాన రహదారిలో జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత మనందరి బాధ్యత

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పారిశుధ్య పనులు చేపట్టారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలిగించడం, మురుగు కాల్వల్లో దోమలమందు స్ప్రే చేయడం, రోడ్డుకు ఇరువైపులా కలుపు మొక్కలను తొలిగించడం వంటి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వచ్ఛత మనందరి బాధ్యత అన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు రావన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పలుపునిచ్చారు.

– జిల్లా నెట్‌వర్క్, అక్టోబర్ 1


దుబ్బాక టౌన్ : దుబ్బాకలో రోడ్డు ఊడుస్తున్న చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి, వార్డు ప్రజలు


జగదేవ్‌పూర్ : శ్రమదానంలో పాల్గొన్న ఎంపీపీ బాలేశంగౌడ్, నాయకులు


ములుగులో 'స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వీధులు శుభ్రం చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి